# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 25-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

2. **ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

3. **ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.**

4. **రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా అమలు చేస్తున్న ఏపీసిఎన్ఎఫ్ కార్యక్రమ క్షేత్రాలను గ్లోబల్ ఇనీషియేటివ్ ఫర్ సస్టైనబిలిటి ప్రతినిధి బృందం సందర్శించింది.**

5. **ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్ డే మ్యాచ్‌లో భారత్ విజయ లక్ష్యం 237 పరుగులు.**

=========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-------------------------

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం వై.వి.లంకలో జలజీవన్ మిషన్ నిధులు 82 లక్షల 50 వేల రూపాయలతో చేపట్టనున్న పనులకు ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి చోట నిరంతరాయంగా శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు తెలుపుతూ..

వాయిస్.. 26 సెకన్లు

-------------------------

ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో 71 మంది లబ్ధిదారులకు 37లక్షల 88 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్ .. 23 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థల సంయుక్త సహకారంతో, జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99888 53335, అదే విధంగా 87126 55686 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

---------------------------

సాంకేతిక పరిజ్ఞానంతో బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తిరుపతిలో ఆయన నిన్న పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులతో బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. గోదాములు, రేషన్ షాపుల్లో త్వరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ –ఏపీసిఎన్ఎఫ్ కార్యక్రమ క్షేత్రాలను గ్లోబల్ ఇనీషియేటివ్ ఫర్ సస్టైనబిలిటి ప్రతినిధి బృందం ఈరోజు సందర్శించింది. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలంలోని చెవుటూరు గ్రామంలో బృంద సభ్యులు పర్యటించారు. ప్రపంచవ్యాప్తంగా సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థ కోసం కృషి చేస్తున్న ఈ ఉన్నత స్థాయి బృందం, ఏపీసిఎన్ఎఫ్ అమలు విధానం, ఫలితాలు, గ్రామీణ జీవనోపాధులపై ప్రకృతి వ్యవసాయ ప్రభావాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ వ్యవసాయానికి సంబంధించిన తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వారికి వివరించారు. అనంతరం ప్రతినిధులు గ్రామంలోని బయో రిసోర్స్ సెంటర్‌ను సందర్శించి, ప్రకృతి వ్యవసాయ రైతులకు అవసరమైన జీవ ఉత్ప్రేరకాలు, ఇతర ఇన్ పుట్ల తయారీ, సరఫరా విధానాలను అడిగి తెలుసుకున్నారు.

---------------------------

భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా నిర్వహిస్తున్న వన్ డే సిరీస్‌లో 3వ వన్ డే మ్యాచ్ ఈ రోజు సిడ్నిలో జరుగుతోంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకుంది. 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్ ముందు 237 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది.

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ పర్యటన ముగించుకుని ఈరోజు తెల్లవారుజామున హైదరాబాద్ చేరుకున్నారు. అమరావతికి ముఖ్యమంత్రి రేపు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గుంటూరు జిల్లా మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పలువురు పార్టీ నాయకులతో రేపు ఆయన సమావేశం అవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా, మండల అధికారులతో జిల్లా కలెక్టర్ ఎమ్ఎన్ హరేంధిర ప్రసాద్ ఈరోజు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రానున్న 3 రోజులు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఇప్పటికే సముద్రంలోకి వెళ్లి ఉంటే ఒడ్డుకు చేరుకోవడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో, ఆర్డీవో కార్యాలయాలలో, తహశీల్దార్ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు తెలపాలని జిల్లా కలెక్టర్ చెప్పారు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు ఆగ్నేయ, మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, రేపటికి తీవ్రవాయుగుండంగా రూపాంతరం చెందుతుందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

..వాయిస్..20 సెకన్లు

---------------------------

సైబర్ నేరస్థుల బారిన పడకుండా ప్రతి ఒక్కరు పోలీసులు చేప్పే నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర్ విద్యార్థులకు సూచించారు. బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల తీరు పట్ల అవగాహన కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదన్నారు. మొబైల్‌లో తెలియని లింకులను క్లిక్ చేసి మోసపోవద్దని సూచించారు. విద్యార్థి దశలో నుంచే సైబర్ నేరాల పట్ల, సైబర్ నేరస్తుల వ్యవహార శైలి పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

---------------------------

ఏలూరు జిల్లాలో ఈ - పంట, ఈ- కెవైసి నమోదు వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి నిన్న సాయంత్రం ఉద్యానవన శాఖల లక్ష్యాలపై అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

======================